సాక్షి నంద్యాల

మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



వెండి రథంపై ఆలయ ప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి ఉత్సవమూర్తులను సోమవారం వెండి రథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు. ముందుగా సహస్రదీపార్చన సేవ నిర్వహించారు.



ఉరుకుందలో భక్తుల రద్దీ

కౌతాళం: ఉరుకుందలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. క్షేత్ర ఆవరణలోనే పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు.



ప్రయాణం ఆటో ఇటో..

కొందరు ఆటోవాలాలు రహదారి నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు చేసుకుంటున్నాయి. వివిధ ప్రమాదాల్లో నాలుగేళ్లలో 107 మంది మృత్యువాత పడ్డారు.

8లో▸

న్యూస్‌రీల్

మద్దిలేటయ్యలో చలువ పందిళ్లు



ఆలయ ఆవరణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

బేతంచెర్ల: వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీమద్దిలేటి నరసింహస్వామి ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి చివరి వారంలోనే ఎండలు పెరుగుతుండటంతో భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణం, పార్కు ముందు భాగంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుండటంతో మెరుగైన వసతులు కల్పిస్తున్నామన్నారు.

స్వల్ప కాల కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మూడు నెలల కాల వ్యవధి కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ గోపినాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాకిన్ సంస్థ సహకారంతో ఎయిర్ కండీషన్ ఫీల్డ్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సెల్యూషన్స్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్ కోర్సులలో మూడ నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం సర్టిఫికెట్లను జారీ చేయడంతో పాటు వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. 10వ తరగతి పాస్ అయ్యి ఉండి 18నుంచి 35 ఏళ్ల వయస్సు వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక స్కిల్ కేంద్రం, ప్రభుత్వ ఐటీఐ కళాశాల, 9542643747ను సంప్రదించాలని ఆయన సూచించారు.

శ్రీమఠంలో డీఐజీ అమ్మిరెడ్డి



కుటుంబ సభ్యులతో డీఐజీ అమ్మిరెడ్డి

మంత్రాలయం రూరల్: శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు అడ్మిన్ డీఐజీ అమ్మిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వీరితో పాటు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తదితరులు ఉన్నారు.


రూ.2.87 కోట్ల డైట్ బడ్జెట్ విడుదల



నాగేశ్వరరావు

కర్నూలు(అర్బన్): జిల్లాలో వెనుకబడిన తరగతులకు చెందిన వసతి గృహాల్లోని విద్యార్థుల డైట్ చార్జీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2,78,74,000 విడుదల చేసినట్లు జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు రూరల్ పరిధిలోని 14 ప్రీమెట్రిక్ వసతి గృహాలకు రూ.1,42,85,000, కర్నూలు అర్బన్ పరిధిలోని 6 పోస్టు మెట్రిక్ వసతి గృహాలకు రూ.80 లక్షలు, ఆదోని పరిధిలోని ఆరు పోస్టు మెట్రిక్ వసతి గృహాలకు రూ.55.89 లక్షలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ ఏడాది మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఈ నెల వరకు బడ్జెట్‌ను అదనంగా విడుదల చేసిందన్నారు.

మచిలీపట్నం రైలు వేళలు మార్పు



కర్నూలు(రాజ్‌విహార్): మచిలీపట్నం నుంచి కర్నూలుకు నడిచే రైలు వేళల్లో మార్పులు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళ, గురు, శనివారాల్లో నడిచే రైలు (నంబర్ 07067) మచిలీపట్నం నుంచి రాత్రి 8 గంటలకు బయలుదేరి నంద్యాలకు అర్ధరాత్రి 3.20 గంటలకు, డోన్‌కు తెల్లవారుజామున 5.45 గంటలకు, కర్నూలుకు ఉదయం 7.30 గంటలకు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ మార్పు మార్చి 1 నుంచి 30వ తేదీ వరకు ఉంటుందని, ప్రయాణికులు గమనించాలని కోరారు.

గౌరు వెంకటరెడ్డి.. భూమా అఖిల ప్రియ.. ఈ ఇద్దరి కుటిల రాజకీయం ఎట్టకేలకు బయటపడింది. బలం లేదని తెలిసినా.. గెలవలేమనేది స్పష్టమైనా.. ఆ పార్టీ మద్దతుతో సర్పంచ్‌లుగా గెలిచిన అభ్యర్థులనే స్వతంత్రులుగా బరిలో నిలిపారు. తెర వెనుక రాజకీయం నెరిపి.. వారిపైనా నమ్మకం లేక ఉపసంహరణ గడువు ముగిసే వరకు ఇద్దరినీ అజ్ఞాతంలోకి తరలించారు. ప్రజల్లో అపహాస్యం అవుతామని తెలిసినా.. ఈ ఇద్దరు నాయకులు 'స్వతంత్ర' పాచికతో ఆ పార్టీ పరువును బజారునపడేశారు. కనీసం పార్టీ గుర్తు మీద అభ్యర్థులను నిలపలేని నాయకుల తీరు ఆ పార్టీ నేతల్లోనే చర్చకు తావిస్తోంది.

త్రిముఖ పోరు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ దిగజారుడు రాజకీయం

- బలం లేకపోయినా పార్టీ నేతలతో నామినేషన్లు
- నామినేషన్లు వేసిన మోహన్‌రెడ్డి, భూమా వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు టీడీపీ సర్పంచ్‌లే
- స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ
- పరిశీలనలో శ్రీనివాసులు నామినేషన్ తిరస్కరణ
- బరిలో వైఎస్సార్‌సీపీ నేత బోయ మధు, మోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికల ఓట్లు

డివిజన్/పోలింగ్ కేంద్రం	పురుషులు	స్త్రీలు	మొత్తం
ఆదోని	105	154	259
పత్తికొండ	63	81	144
కర్నూలు	87	104	191
డోన్	75	96	171
నంద్యాల	111	137	248
ఆత్మకూరు	71	94	268
మొత్తం	512	666	1178



డాక్టర్ బోయ మధుసూదన్

సాక్షి ప్రతినిధి కర్నూలు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోటీ అనివార్యమైంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత డాక్టర్ బోయ మధుసూదన్‌తో పాటు టీడీపీ నేతలు మోహన్‌రెడ్డి, భూమా వేణుగోపాల్‌రెడ్డి కూడా బరిలో నిలిచారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు, ఓటర్ల వివరాలను రిటర్నింగ్ అధికారి రామసుందర్ రెడ్డి సోమవారం అధికారికంగా ప్రకటించారు. నిజానికి 'స్థానిక సంస్థల'లో టీడీపీకి ఏమాత్రం బలం లేదు. 90శాతంపైగా వైఎస్సార్‌సీపీ ఓటర్లు. అయినప్పటికీ తమ పార్టీ నేతలతో నామినేషన్లు వేయించారు. ఓటమి తప్పదని తేలడంతో పార్టీ తరఫున కాకుండా స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలపడం గమనార్హం.

స్థానిక సంస్థల ఎన్నికల ఎమ్మెల్సీకి నోటిఫికేషన్ జారీ అయిన రోజే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సునాయాసంగా గెలుస్తారని, పోటీ ఉండదని.. ఏకగ్రీవమవుతుందని అంతా భావించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సింహభాగం ఓట్లు వైఎస్సార్‌సీపీకి ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆదోని నియోజకవర్గానికి చెందిన డాక్టర్ బోయ మధుసూదన్ నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఆయనతో పాటు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరి శ్రీనివాసులు, శిరివెళ్ల మండలం మోత్కులపల్లి, ఓర్వకల్లు మండలం గుట్టపాడు సర్పంచ్‌లు భూమా వెంకట వేణుగోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. ఈ ముగ్గురూ టీడీపీ నేతలే. ఆ పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచ్‌లే. అయితే నామినేషన్లు మాత్రం ముగ్గురూ స్వతంత్ర అభ్యర్థులుగా దాఖలు చేయడం గమనార్హం. వీరి నామినేషన్లు బలపరిచిన అభ్యర్థులు కూడా టీడీపీ నేతలే. ఎన్నికల్లో 90శాతం ఓట్లు ఉన్న వైఎస్సార్‌సీపీ సునాయాసంగా గెలుస్తుందని, ఓటమి తప్పదని గ్రహించి తాము ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ పేరు కూడా నామినేషన్‌లో కనపర్చలేకపోయారు. వీరిలో టీడీపీ ఉపాధ్యక్షుడు కుమ్మరి శ్రీనివాసులు సంతకాలు ఫోర్జరీ చేశారని తేలడంతో అతని నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి రామసుందర్‌రెడ్డి తిరస్కరించారు. తక్కిన ఇద్దరు 'పచ్చ' నేతలు బరిలో నిలిచారు.

వైఎస్సార్‌సీపీకి వెయ్యికి పైగా ఓట్లు..

స్థానిక సంస్థల పోరులో మొత్తం 1,178 ఓట్లు ఉన్నాయి. ఇందులో వైఎస్సార్‌సీపీకి 985 ఓట్లు ఉన్నాయి. ఇవి కాకుండా ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీల ఓట్లు కలిపితే ఆ సంఖ్య వెయ్యి దాటుతుంది. టీడీపీకి 127 ఓట్లు మాత్రమే ఉన్నాయి. అలాగే బీజేపీ 8, సీపీఐకి 4 ఓట్లు ఉన్నాయి. తక్కిన వారు స్వతంత్ర అభ్యర్థులుగా స్థానిక పోరులో గెలిచారు. 'స్థానిక' ఓటర్లంతా జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కార్పొరేటర్, కౌన్సిలర్లు. వీరు ఆయా పార్టీ గుర్తులపై గెలిచినవారే. ఇంత స్పష్టంగా పార్టీల బలాబలాలు తెలిసినా, తమకు బలం లేదని గ్రహించినా టీడీపీ తమ పార్టీ నేతలను స్వతంత్రులుగా బరిలోకి దించింది. టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు గౌరు వెంకటరెడ్డి.. మోహన్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేసిన తర్వాత అతడిని రహస్య ప్రాంతానికి తరలించినట్లు ఆ పార్టీ నేతల్లో చర్చ జరుగుతోంది. అలాగే వేణుగోపాల్‌రెడ్డిని కూడా అఖిలప్రియ మరో ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే వరకూ కనీసం వీరి ఫోన్లు కూడా పనిచేయకుండా జాగ్రత్త పడ్డారు. అంటే నామినేషన్ వేసిన తర్వాత వీరి పార్టీ నేతలపై వీరికి నమ్మకం లేకపోవడంతోనే రహస్య ప్రాంతానికి తరలించారని అర్థమవుతుంది. ఏదిఏమైనా టీడీపీ నేతల చర్యలతో స్థానిక ఎమ్మెల్సీ పోరు అనివార్యమైంది. దీంతో నేటి నుంచి అభ్యర్థులు ప్రచారపర్వాన్ని ప్రారంభించనున్నారు.

పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని నోడల్, సెక్టోరల్ అధికారులను కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జాయింట్ కలెక్టర్ టి. నిశాంతితో కలిసి నోడల్ అధికారులు, సెక్టోరల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ అధికారుల శిక్షణా తరగతులకు గైర్హాజరైన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఆర్‌ఓ పుల్లయ్యను ఆదేశించారు. సెక్టోరల్ అధికారులు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలను సందర్శించి విద్యుత్, టాయిలెట్స్, ఫర్నిచర్, ర్యాంపులు తదితర సౌకర్యాలను పరిశీలించాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదికలు సిద్ధం చేయాలని డీఎస్పీ మహేశ్వర్ రెడ్డికి సూచించారు. షార్ట్ టెండర్లను పిలిచి పోలింగ్ సామగ్రిని సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ప్రక్రియకు అవసరమయ్యే వాహనాలను సమకూర్చుకోవాలన్నారు.

స్పందన వినతులపై నిర్లక్ష్యం వీడాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జేసీ నిశాంతి

నంద్యాల: స్పందన వినతుల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి, డీఆర్‌ఓ పుల్లయ్యతో కలిసి కలెక్టర్ ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన వినతుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి దరఖాస్తును 24 గంటల్లో ఓపెన్ చేసి పరిష్కరించడమా లేదా తిరస్కరించడమా అనే అంశాలపై వివరణ ఇవ్వాలని, తిరస్కరిస్తే సరైన కారణాలు విశ్లేషించి నమోదు చేయాలన్నారు. కొన్ని మండలాలు, సచివాలయాల్లో సరైన రీతిలో స్పందించకపోవడంతో వినతులు పునరావృతం అవుతున్నాయన్నారు. కోర్టు ఉత్తర్వులను కూడా వెంటనే అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. స్పందనలో 228 వినతులు వచ్చాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వైఎస్ఆర్ పెన్షన్ కానుకకు రూ.126.32 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ పెన్షన్ కానుక కింద మార్చి నెల పింఛన్ల పంపిణీకి ఉమ్మడి కర్నూలు జిల్లాకు రూ.126,32,10,000 విడుదలైంది. ఉమ్మడి జిల్లాలో 4,56,007 పింఛనుదారులకు ఈ మొత్తం పంపిణీ చేయనున్నారు. మంగళవారం వార్డు, గ్రామ సచివాలయ సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సంబంధిత బ్యాంకుల నుంచి వైఎస్ఆర్ పెన్షన్ కానుక నిధులను డ్రా చేయనున్నారు. 1వ తేదీ ఉదయం 5 గంటల నుంచి పింఛను పంపిణీ మొదలవుతుందని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

ఫిర్యాదులు పునరావృతం కాకూడదు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: స్పందనలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదులు పునరావృతం కాకుండా పోలీసు అధికారులు పరిష్కరించాలని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అర్జీదారుల నుంచి 72 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఎక్కువగా ఆస్తి తగాదాలు, అత్తింటి వేధింపులు తదితర ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వాటిలో కొన్ని సమస్యలను ఫోన్‌లో నేరుగా మాట్లాడి పరిష్కరించగా మరికొన్నింటిని ఆయా స్టేషన్ అధికారులకు పంపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కల్పన తదితరులు పాల్గొన్నారు.

పెద్దపులి దాడిలో ఆవు మృతి



సంఘటనా స్థలంలో పులి పాదముద్ర



ఆవు కళేబరానికి పోస్టుమార్టం చేస్తున్న వైల్డ్‌లైఫ్ వెటర్నరి అధికారులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని నల్లకాల్వ గ్రామ పంట పొలాల్లో ఆదివారం రాత్రి ఆవుపై పెద్దపులి దాడి చేసి చంపేసింది. గ్రామానికి చెందిన రైతు మహానంది ఆవు వెలుగోడు రేంజ్ నార్త్ బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలోని పంట పొలాల వద్ద ఉండగా దాడి చేసింది. సమాచారం తెలుసుకున్న ఆత్మకూరు డీఎఫ్‌టీ అలెన్ చోంగ్ టిరాన్, వెలుగోడు ఎఫ్ఆర్‌వో తదితర అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆవు కళేబరాన్ని పరిశీలించి పులి దాడిలో మృత్యువాత పడినట్లు గుర్తించి అక్కడే పోస్టుమార్టం చేసి దహనం చేశారు. పులి పాదముద్రలను సేకరించారు. రుద్రకోడు చెంచు గూడెం పంట పొలాల్లో కూడా పులి అడుగులను అటవీ సిబ్బంది గుర్తించారు. మినుము పంట కోతలు జరుగుతుండటంతో పరిగ కోసం ఆవుల మందల తిరుగుతున్నాయి. పులి ఆహారం కోసం ఆవుల మందపై గురి పెట్టి మూడు రోజులుగా అక్కడే మకాం వేసినట్లు తెలుస్తోంది.



హంస వాహనంపై ఊరేగుతున్న జ్వాలనరసింహుడు



ధ్వజారోహణ పూజలు చేస్తున్న అర్చకులు



సింహ వాహనంపై కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు

దేవతలారా దీవించండి

- సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజపటావిష్కరణ, ధ్వజారోహణ
- హంస వాహనంపై విహరించిన జ్వాల నరసింహుడు



ప్రత్యేకాలంకరణలో ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఉదయం దిగువ అహోబిలంలో మఠం పీఠాధిపతి శ్రీరంగరాజ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వాములను నూతన పట్టు పీతాంబరాలతో అలంకరించి పూల పల్లకీలో కొలువుంచారు. మరో పల్లకీలో అహోబిలం మఠంలో కొలువైన మొదటి జీయర్ ఆదివన్ షటగోపన్ ఉత్సవ విగ్రహాన్ని కొలువుంచి మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా గాలి గోపురం ఎదురుగా ఉన్న ధ్వజ స్తంభం వద్దకు తోడ్కొని వచ్చారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సకల దేవతామూర్తులను ఆహ్వానిస్తూ గరుత్మంతుని చిత్రపటావిష్కరణ చేశారు. మార్చి 5వ తేదీన లక్ష్మీనారసింహుడి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మహోత్స వానికి ముక్కోటి దేవతలు కదలి వచ్చి, విందారగించి స్వామి అమ్మవార్లను ఆశీర్వదిస్తారని, తద్వారా లోక కల్యాణం నిర్వహించినట్లు అవుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఇక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లను ఆశీర్వదించేందుకు వచ్చే ముక్కోటి దేవతలు, తరలి వచ్చే భక్తకోటికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా గరుత్మంతుడు అనుక్షణం కాపలా ఉంటారని విశ్వాసం.

సింహ వాహనాధీశా.. నమో నారసింహా..

దిగువ అహోబిలంలో వెలిసిన శ్రీ ప్రహ్లాదవరద స్వామి సింహ వాహనంపై కొలువై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం మధ్యాహ్నం భేరీ పూజ నిర్వహించారు. రాత్రి శ్రీ ప్రహ్లాదవరదస్వామిని విశేషంగా అలంకరించి సింహ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజల్లో ప్రధానార్చకులు వేణుగోపాలన్, మణియార్ సౌమ్యా నారాయణ్, మేనేజర్ శ్రీనివాసన్, బ్రహ్మోత్సవాల ప్రత్యేకాధికారి సేతురామన్ పాల్గొన్నారు. మంగళవారం ఉదయం హంసవాహనం, రాత్రి సూర్య ప్రభ వాహనాలపై స్వామి వారు ఊరేగుతారు.

ఎగువ అహోబిలంలో...

అహోబిల బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోవ రోజు సోమవారం ఎగువ అహోబిలంలో వేడుకలు కనుల పండువగా సాగాయి. ఉదయం శ్రీ జ్వాల నరసింహ స్వామి హంస వాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించగా, రాత్రి సూర్యప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. మంగళవారం హనుమంత వాహన సేవ నిర్వహించనున్నారు.

అన్నదాతకు వెన్నుదన్ను

- నేడు మూడో విడత వైఎస్సార్ రైతుభరోసా– పీఎం కిసాన్ నిధులు విడుదల
- తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్
- జిల్లాలో 2,21,241 మంది రైతులకు ప్రయోజనం
- మాండోస్ తుఫాన్ బాధితులకు ఇన్‌పుట్ సబ్సిడీ



నంద్యాల: రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. రైతు భరోసా పథకం కింద సీజన్‌కు ముందే పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. ఈ ఏడాది మూడో విడత వైఎస్సార్ రైతుభరోసా–పీఎం కిసాన్ పెట్టుబడి సాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో మంగళవారం జమ కానుంది. అలాగే మాండూస్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ కూడా విడుదల కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. బటన్ నొక్కి రైతుల బ్యాంకు ఖాతాలకు నగదును జమ చేయడాన్ని ప్రారంభించనున్నారు. నంద్యాల నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్, జేసీ, డీఏవో తదితరులు పాల్గొననున్నారు. జిల్లాలో 2,13,929 మంది రైతులకు రూ.44.74 కోట్లు, 6,857 మంది కౌలు రైతులకు రూ.2.5కోట్లు, 455 మంది ఆర్‌ఓఎఫ్‌ఆర్ రైతులకు రూ.9.10 లక్షలు మొత్తం 2,21,241 మంది రైతులకు రూ.46.88 కోట్ల నగదు జమ చేయనుంది. మాండూస్ తుఫాన్ కింద పంట నష్టపోయిన 1,966 మంది రైతులకు రూ.1.62 కోట్లు జమ చేయనుంది. ఈ ఏడాది వైఎస్సార్ రైతుభరోసా కింద ఇప్పటి వరకు రెండు విడతల్లో రూ.11,500 పెట్టుబడి సాయం అందింది. తాజాగా రూ.2000 లభిస్తోంది. వైఎస్ఆర్ రైతుభరోసా కింద రూ.13,500 లభించినట్లు అవుతోంది.

ఆర్‌బీకేల్లో అర్హుల జాబితా..

జిల్లాలో 28 మండలాల పరిధిలోని గ్రామాల్లోని 411 రైతు భరోసా కేంద్రాల్లో వైఎస్సార్ రైతు భరోసా పథకానికి అర్హత సాధించిన రైతు కుటుంబాల వివరాల జాబితా ఉంచారు. అలాగే మాండూస్ తుఫాన్‌తో నష్టపోయిన రైతుల జాబితా సైతం అందుబాటులో ఉంది. ఆయా గ్రామాల్లోని రైతులు ఆర్‌బీకే కేంద్రాల వద్ద ఉన్న జాబితాను చూసుకొని అర్హులైన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విత్తనాల కొనుగోళ్లు, నారుమళ్ల దుక్కులు, తదితర వ్యవసాయ అవసరాల కోసం అప్పు చేయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం నగదును అందజేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగేళ్లలో ఇలా..

రైతుభరోసా పథకం కింద 2019–20లో 2,09,861 మంది రైతులకు రూ.283.31 కోట్లు, 2020–21లో 2,15,936 మంది రైతులకు రూ.291.51 కోట్లు, 2021–22లో 2,15,595 మంది రైతులకు రూ.291.05 కోట్లు, 2022–23లో మొదటి విడత 2,09,381 మంది రైతులకు రూ.115.25 కోట్లు వారి ఖాతాల్లో ప్రభుత్వం నగదు జమ చేసింది. రెండో విడత 2,20,497 మంది రైతులకు రూ.96.45కోట్లు జమ కాగా, మంగళవారం మూడో విడత 2,21,241 మంది రైతులకు రూ.46.88 కోట్లు వారి ఖాతాల్లో జమ కానుంది.

జిల్లాలో మూడో విడత జమ కానున్న రైతు భరోసా సాయం (రూ.కోట్లలో)..

నియోజకవర్గం	రైతులు	నగదు
ఆళ్లగడ్డ	45,955	9.86
బనగానపల్లె	42,180	8.92
డోన్	35,648	7.52
నందికొట్కూరు	39,962	8.43
నంద్యాల	15,329	3.22
పాణ్యం	14,911	3.70
శ్రీశైలం	27,256	5.86

ఇన్‌పుట్ సబ్సిడీ (రూ.లక్షల్లో)..

నియోజకవర్గం	రైతులు	నగదు
ఆళ్లగడ్డ	997	62.46
నంద్యాల	237	34.65
శ్రీశైలం	171	15.54
పాణ్యం	125	8.17
బనగానపల్లె	67	4.58
నందికొట్కూరు	268	29.15
డోన్	12	0.90

రైతు సంక్షేమానికి పెద్దపీట



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారు. ఏటా రైతు భరోసా కింద రూ. 13 వేలు అందజేస్తున్నారు. నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా నా ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో ఎరువులు, విత్తనాలు, మందులు అందుతున్నాయి. వ్యవసాయానికి పూర్వ వైభవం తెస్తున్నారు.

–భాస్కర్, రైతు, రాయపాడు గ్రామం

అర్హులందరికీ రైతు భరోసా



వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ కింద అర్హులైన రైతులకు ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో మంగళవారం నగదు జమ చేయనుంది. అర్హుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో ఉంచాం. 2022–23వ సంవత్సరానికి సంబంధించి మూడో విడత పెట్టుబడి సాయాన్ని రబీ పంటల నూర్పిళ్ల సమయంలో విడుదల చేస్తుండటం రైతులకు పెద్ద ఊరట ఇస్తోంది.

– మోహన్‌రావు, డీఏఓ, నంద్యాల

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ

కర్నూలు(లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సోమవారం పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్, జువైనల్ జస్టిస్ యాక్ట్, మహిళలకు సంబంధించిన హక్కులపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీనివాసరావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జుబేదా బేగం, ప్రభుత్వ బాలుర పరిశీలన వసతి గృహం సూపరింటెండెంట్ హుసేన్ బాషా పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ మృతి

గూడూరు రూరల్: కుటుంబ కలహాల కారణంగా బోయ ఐశ్వర్య(23) అనే మహిళ సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. బళ్లారికి చెందిన ఐశ్వర్య, సి.బెళగల్‌కు చెందిన రాఘవేంద్ర ప్రసాద్ రెండు నెలలుగా గుడిపాడులోని ఒక ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. గతంలో ఐశ్వర్యకు వివాహం కాగా ఒక కుమారుడు ఉన్నాడు. సి.బెళగల్‌కు చెందిన రాఘవేంద్ర ప్రసాద్‌కు కూడా గతంలో మరొక మహిళతో వివాహం కాగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్తను వదిలివేసిన ఐశ్వర్యకు, భార్యను వదిలివేసిన రాఘవేంద్ర ప్రసాద్‌తో పరిచయం ఏర్పడటంతో పది నెలలు కిందట వివాహం చేసుకుని గుడిపాడుకు వచ్చి నివాసం ఉంటున్నారు. కొన్ని రోజులుగా ఐశ్వర్య సెల్‌ఫోన్‌లో ఇతరులతో ఎక్కువగా మాట్లాడుతుండటాన్ని చూసిన భర్త మాట్లాడవద్దని వారించాడు. దీంతో మనస్తాపానికి గురైన ఐశ్వర్య ఇంటిలోనే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

☛ దేవనకొండ మండలం పి.కోటకొండకు చెందిన బోయ మధు (19) గౌండా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. గత ఏడాది నవంబర్ 6వ తేదీ ముగ్గురుతో కలసి గౌండా పని కోసం కర్నూలుకు ఆటోలో బయలుదేరాడు. సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఉండటంతో మార్గమధ్యలో కోడుమూరు మండలం కొత్తూరు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. మధుపై ఆటో పడటంతో అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురు గాయాలపాలయ్యారు.

☛ కోడుమూరు పట్టణానికి చెందిన పరమేష్ (19) డిగ్రీ చదువుకుంటూ పొలం పనులు చేస్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు. వాము పంటను మార్కెట్‌లో విక్రయించేందుకు ఈనెల 21వ తేదీ ట్రాలీ ఆటోలో కర్నూలుకు వెళ్తుండగా ప్యాలకుర్తి బస్‌స్టేజీ వద్ద ఆటో బోల్తా పడింది. అందులో ఉన్న పరమేష్ మృతిచెందగా డ్రైవర్ గాయాలతో బయటపడ్డాడు.

☛ ఇలా నిత్యం ఏదో చోట జిల్లాలో ఆటో ప్రమాదాలు వెలుగు చూస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా డ్రైవర్లు వ్యవహరిస్తున్నారు. ప్రయాణికుల్లోనూ మార్పు కనిపించడం లేదు.

ట్రాలీ ఆటోలో ప్రమాదకర ప్రయాణం





- రహదారి భద్రత నిబంధనలు పాటించని కొందరు ఆటోవాలాలు
- నియంత్రణ కోల్పోయి నిత్యం ఏదో చోట ప్రమాదాలు
- నాలుగేళ్లలో 107 మంది మృత్యువాత
- వీధిన పడుతున్న బాధిత కుటుంబాలు

ప్రయాణం ఆటో ఇటో!

నాలుగేళ్లలో 107 మంది మృత్యువాత...

కర్నూలు: కొందరు ఆటోవాలాలు సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. ఇంకొందరు సరుకు రవాణా వాహనాల్లోనూ కూలీలను పొలాలకు తీసుకెళ్తున్నారు. విద్యార్థులు మొదలు ఉద్యోగుల వరకు అవసరాల రీత్యా ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. ఇదే క్రమంలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న వాహనాలను కట్టడి చేయడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కేవలం రికార్డుల తనిఖీ, అపరాధ రుసుం వేయడంతోనే సరిపెట్టుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రమాదాల పరంపర క్షేత్రస్థాయి పరిస్థితులను విశ్లేషించి దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏం జరుగుతోంది..

ఆర్టీసీ బస్సులు లేని గ్రామీణ రూట్లలో నలుగురు ప్రయాణించాల్సిన మూడు చక్రాల ఆటోలో పది నుంచి పదిహేను మందిని తరలిస్తున్నారు. ఏడుగురి సామర్థ్యమున్న వాహనంలో 20 మందికి పైగా తరలిస్తున్నారు. రవాణా ఆటోలను భారీ సంఖ్యలో కూలీలను దూర ప్రాంతాలకు తరలించడం కోసం వాడుతున్నారు. సుమారు 30 మందిని ఎక్కించుకుని, టాప్ పైన కూడా కూర్చోబెట్టి మరీ వేగంగా దూసుకెళ్తున్నారు. అధిక ప్రమాదాలకు ఇదో కారణంగా తెలుస్తోంది.

వీటిపై దృష్టి సారించాలి...

రవాణా శాఖ అధికారులతో పాటు మండల, నియోజకవర్గ పోలీసు శాఖ ఎస్‌ఐలకు వాహన తనిఖీ అధికారం ఉంది. ఆటోల్లో ప్రయాణికుల పరిమితి, రికార్డుల పరిశీలన చేసి తగిన కేసులు నమోదు చేస్తారు. జిల్లా అంతటా కొంతకాలంగా తనిఖీలు అంతంతమాత్రమే. ఈ పరిస్థితి లో మార్పు రావాలి. తనిఖీలు ఎలా తప్పించుకోవాలన్నదే ఆటో వాలాల లక్ష్యంగా మారింది. పోలీసులు హెచ్చరిస్తున్నా వారి లో మార్పు మాత్రం రావడం లేదు. తప్పని పరిస్థితుల్లో అయితే జరిమానా కట్టేందుకు వెనుకాడటం లేదు. సరుకు రవాణా ట్రాలీ ల్లో ప్రయాణికులను తరలింపుపై గతంలో అవగాహన కార్యక్రమాలు ఉండేవి. కొంతకాలంగా అవి తూతూమంత్రంగా సాగుతున్నాయి. ఇప్పటికైనా ఈ అంశాలపై దృష్టి సారించి ప్రయాణ భద్రత పాటించేలా కౌన్సెలింగ్, అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలి.

ఆటో ప్రమాదాల్లో అత్యధికంగా డ్రైవర్ల నిర్లక్ష్యం కనిపిస్తోంది. అందులోనూ ఎక్కువ శాతం సామర్థ్యానికి మించి ప్రయాణికులను అనుమతిస్తుండటం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయనే విషయం పలు సంఘటనల్లో బయటపడింది. నాలుగేళ్ల వ్యవధిలో జిల్లాలో జరిగిన ఆటో ప్రమాదాల్లో 107 మంది మృతి చెందగా 516 మంది క్షతగాత్రులయ్యారు. ఆటో నిబంధనల అతిక్రమణపై సుమారు మూడు వేలకు పైగా కేసులు నమోదయ్యాయంటే వాటి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ ఏడాది రెండు నెలల కాలంలోనే సామర్థ్యానికి మించి ప్రయాణికులను చేరవేస్తున్నట్లు గుర్తించి 450 ఆటోలపై కేసులు నమోదు చేశారు.

ఉమ్మడి జిల్లాలో ఆటో ప్రమాదాలు ఇలా...

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2019	137	28	184
2020	119	24	108
2021	107	26	117
2022	121	29	107

పాటించాల్సిన నిబంధనలు ఇవీ...

☛ ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకూడదు.
☛ వాహనానికి సంబంధించిన అన్ని రికార్డులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలి (కలిగిఉండాలి).
☛ వాహనాలను ఇష్టానుసారంగా రహదారులపై నిలుపరాదు.
☛ పాఠశాలల బస్సులు, ఆటో డ్రైవర్లు వేగ పరిమితి నిబంధన పాటించాలి.
☛ తల్లిదండ్రులు ఆటోలో వెళ్లే విద్యార్థుల సంఖ్యను గమనించాలి.

తనిఖీలు ముమ్మరం చేస్తాం



ఆటోలు నడపటంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చినప్పుడు ఆటోడ్రైవర్లను సమావేశపరచి నిబంధనలను వివరిస్తున్నాం. అయినప్పటికీ అక్కడక్కడా ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్యాత్మక మార్గాల్లో తనిఖీలు ముమ్మరం చేస్తాం.

– శ్రీధర్, డీటీసీ

అవగాహన లేకపోవడం వల్లే ప్రమాదాలు



ఆటో ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన లేకపోవడం, ఎంత వేగంలోనైనా వాహనాన్ని ఇట్టే నియంత్రించగలననే అతి విశ్వాసం ఇందుకు ప్రధాన కారణాలు. పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం ప్రమాదకరం. రోడ్డు నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి.

– సిద్ధార్థ్ కౌశల్, ఎస్పీ

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

కర్నూలు సిటీ: ఒక కేసు విషయంలో 40 రోజులు రిమాండ్‌లో ఉండి, విద్యాశాఖకు ఎలాంటి సమాచారం ఇవ్వని ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రంగారెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థిక అంశాలకు సంబంధించిన కేసు విషయంలో కర్నూలు మండలం వసంతనగర్ జెడ్పీ హైస్కూల్‌లో భౌతిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.మనోహర్‌కు జిల్లా కోర్టు అక్టోబరు 27న రిమాండ్ విధించింది. అప్పటి నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు జిల్లా జైలులో ఆయన రిమాండ్‌లో ఉన్నారు. అక్టోబరు 10 నుంచి ఈ ఏడాది జనవరి 10వ తేదీ వరకు ఎక్స్‌ట్రార్డినరీ లీవ్(ఈఓఎల్) పెట్టారు. అయితే ఈ విషయంపై విద్యాశాఖకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. నిబంధనలు ఉల్లంఘించడంతో ఉపాధ్యాయుడిని డీఈఓ సస్పెండ్ చేశారు. వసంతనగర్ హెచ్ ఎంకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. మనోహర్ ప్రస్తుతం పని సర్దుబాటు కింద కల్లూరు మండలం వీకర్‌సెక్షన్ కాలనీలోని హైస్కూల్‌లో పని చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

బనగానపల్లెరూరల్: మండల పరిధిలోని మీరాపురం గ్రామానికి చెందిన బిజినేముల సుమిత్ర అనే మహిళ 16 రోజులుగా కనిపించడం లేదు. ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. సుమిత్రను శిరివెళ్ల మండలం జాలేపల్లి గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు సంతానం. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా సుమిత్ర నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామంలోని అవ్వ వద్ద ఉంటోంది. కాగా ఈ నెల 7వ తేదీన మీరాపురం గ్రామంలో పెద్దమ్మ దేవరకు వచ్చి 11వ తేదీన పెద్ద కొట్టాలకు తిరిగి వెళ్లింది. అయితే ఆ రోజు నుంచి ఆమె జాడ లేకపోవడంతో కుటుంబీకులు, బంధువులు అంతటా గాలించినా ఆచూకీ కనిపించలేదు. దీంతో సుమిత్ర తల్లి వెంకట లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సుంకేసులకు 1,920 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసులకు సోమవారం 1,920 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. డ్యాంలో 0.813 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కేసీ కాల్వకు 1,325 క్యూసెక్కుల నీటి విడుదల చేశారు.

పీహెచ్‌సీల్లోనూ కు.ని. ఆపరేషన్లు



కు.ని ఆపరేషన్‌కు వచ్చిన మహిళ వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో(పీహెచ్‌సీ)నూ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రసూతి విభాగంలో కుటుంబ నియంత్రణపై వైద్యులకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ శిక్షణ తర్వాత పీహెచ్‌సీల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని వైద్యులకు సూచించారు. అనంతరం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లపై గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ వెంకటరమణ సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పరి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధవీలత, గోనెగండ్ల స్టాఫ్‌నర్సు వెంకటలక్ష్మి, ఎఫ్ఎన్‌వో మేరి పాల్గొన్నారు.

మహిళలకు ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ మహిళలకు ఎంబ్రాయిడరీ (మగ్గంవర్కు)లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లుగా సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల ఉచిత శిక్షణకు చదవడం, రాయడం వచ్చిన 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు మహిళలు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు 6304491236 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

314 ఆర్‌బీకేల్లో ఉల్లి గోదాములు

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి సాగు చేస్తున్న ప్రాంతాల్లోని రైతుభరోసా కేంద్రాలన్నింటిలో 25 టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆదోని ఏరియా అభివృద్ధి అథారిటీ(ఏఏడీఏ) మండలాల్లో ఉల్లి గోదాముల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. 19 మండలాల్లోని 314 రైతుభరోసా కేంద్రాల పరిధిలో 42,970 ఎకరాల్లో ఉల్లి సాగవుతున్నట్లు ఉద్యాన శాఖ నిర్ధారించింది. ఆయా ప్రాంతాల్లో గోదాముల నిర్మాణానికి రూ.7.06 కోట్లు అవసరం. ఇంతవరకు ఉల్లి గోదాములను 50 శాతం సబ్సిడీతో నిర్మిస్తున్నారు. యూనిట్ కాస్ట్ రూ.1.75 లక్షలు ఉండగా.. సబ్సిడీ రూ.87,500 వస్తుంది.

మిర్చి పంటను విక్రయించేందుకు వెళ్తూ...

– రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతులు మృతి



చిన్న హనుమంతు , కురవ బసవ (ఫైల్)

పెద్దకడబూరు: మిర్చి పంటను విక్రయించేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు రైతులు మృతి చెందారు. దీంతో మండల పరిధిలోని ముచ్చిగిరి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ... గ్రామానికి చెందిన ఏడుగురు రైతులు మిర్చి పంటను అమ్ముకోవడానికి కర్ణాటక రాష్ట్రం బ్యాడిగికి ఆదివారం రాత్రి బొలేరో వాహనంలో బయలుదేరారు. వాహనంలో 115 మిరప (35కేజీల) సంచులతో పాటు ఏడుగురు రైతులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. వాహనం గమ్యస్థానానికి(బ్యాడిగికి 15 కిలోమీటర్ల దూరంలో) చేరుకునేందుకు 20 నిమిషాలు ముందే అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో టైరు పగలి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న రైతుల్లో కురువ చిన్న హనుమంతు(53), కురువ బసవ(38) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ఐదుగురు రైతులు మహలింగ, నరసప్ప, శివరాములు, పెద్ద బసవ, పర్షప్ప, ఇద్దరు డ్రైవర్లు గాయాలతో బయటపడ్డారు.

రేనాటి ఖ్యాతి.. హస్తినలో చాటి!



గేయాలు, రచనలకు వచ్చిన అవార్డులు చూపిస్తున్న విజయ దుర్గ

- ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రపై గేయం
- గేయానికి దేశస్థాయిలో ప్రథమ బహుమతి
- ప్రధానినోట తెలుగు గేయం ప్రస్తావన
- మన్‌కీబాత్‌లో విజయదుర్గకు ప్రశంసలు

కోవెలకుంట్ల: తెల్లదొరలను ఎదిరించిన విప్లవ సింహం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రపై ఓ గృహిణి రచించిన గేయం హస్తినలో మార్మోగింది. 26 భాషలతో పోటీ పడి దేశస్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఢిల్లీలో జరిగిన మన్‌కీబాత్‌తో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగంలో తెలుగు గేయాన్ని ప్రస్తావించి ఆమెపై ప్రశంసలు కురిపించారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబానికి చెందిన తాటిచెర్ల విజయదుర్గ చిన్నచిన్న పాటలు, కవితలు రచిస్తూ అంచెలంచెలుగా ఎదిగి దేశస్థాయిలో ప్రసంశలందుకోవడంతో పలువురు అభినందిస్తున్నారు. కోవెలకుంట్లలో నివాసముంటున్న విజయదుర్గ చిన్నతనం నుంచి పుస్తకాలు చదవటం, కవితలు, పాటలు, సాహిత్యంపై ఆసక్తి చూపేవారు. కడప రేడియో స్టేషన్ నిర్వహించే మహిళా భారతి కార్యక్రమంలో కవితలు వినిపించేవారు. పలు సాహిత్య సభలకు హాజరై కవితలు, పాటలను ఆలపించేవారు. కవితలు, గేయాలకు జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక ప్రసంశలు, సన్మానాలు పొందారు. ఈ క్రమంలో ఒంగోలు జరిగిన రచయితల సమావేశానికి వెళ్లిన సందర్భంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, ఉయ్యాలవాడ బుడ్డా వెంగళరెడ్డి జీవిత చరిత్రలపై రేనాటి సూర్యచంద్రులు గ్రంథాన్ని రచించిన తగ్గిరాల సుబ్బారావు వద్ద వివరాలు సేకరించారు. ఆ రచయిత ద్వారా గ్రంథాన్ని సేకరించి క్షుణ్ణంగా చదివారు. నరసింహారెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని విప్లవ వీరుడిపై గేయాలు రచించాలని శ్రీకారం చుట్టారు గతేడాది ప్రారంభమైన ఏక్‌తా దినోత్సవ కార్యక్రమంలో దేశభక్తిపై గేయాలు, లాలిపాటలు, కవితలు పంపుతూ ప్రతిభ చాటారు.

కుటుంబ నేపథ్యమిది..

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం గ్రామానికి చెందిన వడ్రంగి వృత్తి నిర్వహించే వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బమ్మ దంపతుల కుమార్తె విజయదుర్గ గ్రామంలోనే పదవ తరగతి వరకు విద్యనభ్యసించింది. నంద్యాల మండలం నెహ్రూనగర్ గ్రామానికి చెందిన రత్నమయ్యతో 1987లో వివాహమైంది. ప్రస్తుతం రత్నమయ్య ఉయ్యాలవాడ మండలం హరివరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా పెద్దకుమార్తె స్వజన కోవెలకుంట్ల మండలం కంపమల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో సెకండ్‌గ్రేడ్ టీచర్‌గా, రెండవ కుమార్తె సౌజన్య డోర్నిపాడు మండలం గుండుపాపల గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.ఇద్దరి కుమార్తెలకు వివాహాలు అయ్యాయి.



మనువళ్లు, మనుమరాళ్లతో..

ప్రధానితో మాట్లాడినంత ఆనందంగా ఉంది

మన్‌కీబాత్‌లో దేశ ప్రధాన నరేంద్రమోదీ నేను రచించిన దేశభక్తి గేయాన్ని ప్రస్తావించడంతో సాక్షాత్తు ప్రధాని నాతో మాట్లాడినంత ఆనందంగా ఉంది. తెలుగు గేయానికి దేశ స్థాయిలో ప్రథమ స్థానం దక్కటం అదృష్టం. దీంతో మరింత బాధ్యత పెరిగింది. రాబోయే రోజుల్లో ఇంకా మంచి గేయాలు, కవితలు, గొప్పవారి చరిత్రలు తెలుసుకోవాలన్న సంకల్పం బలపడింది. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు పోరాటం చేసి ప్రాణత్యాగం చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి, వర్ధంతిని దేశవ్యాప్తంగా ఏటా నిర్వహించాలి. దేశ ప్రజల మధ్య ఐక్యత పెంచేందుకు ఏక్‌తా దినోత్సవం ఏర్పాటు చేసిన ప్రధానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. – విజయదుర్గ

విజయ దుర్గ రచించిన గేయం..

రేనాటి సూర్యుడా! వీర నరసింహుడా!
ప్రథమ భారత స్వాతంత్ర్య సమరపు
తొలి అంకురానివి నీవురా! అంకుశానివి నీవురా!
తెల్లదొరల నీతిలేని నిరంకుశపు దమన కాండకు
సలసలమని మరిగిన నీ నెత్తుటి ఎర్రని కాకలు
తళతళమని మెరిసిన నీ కరవాలపు మెరుపులు
తరతరాల నరనరాల స్ఫూర్తి నింపు కాంతులు
రేనాటి సూర్యుడా! వీరనరసింహుడా!

ప్రథమ స్థానంలో నిలిచి.. రూ. 6 లక్షలు గెలిచి..

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్రపై ఆమె రచించిన 'రేనాటి సూర్యుడా! వీర నరసింహుడా!' గేయం దేశస్థాయిలో ఖ్యాతి చాటింది. పోటీలకు దేశంలోని 700కు పైగా జిల్లాల్లోని 26 భాషల్లో 5 లక్షల మందికి పైగా కవితలు, గేయాలు పంపారు. ఈ ఎంట్రీల్లో విజయదుర్గ గేయం దేశవ్యాప్తంగా ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీలోని నెహ్రూ పార్కులో కేంద్ర సాంస్కృతిక మంత్రి రాం మెఘులాల్ చేతుల మీదుగా అవార్డు, ప్రశంస, రూ. 6 లక్షల నగదు బహుమతి కైవసం చేసుకుంది. అలాగే లాలిపాటల రచనలో రాష్ట్రస్థాయిలో మూడవ స్థానంలో నిలిచి బహుమతి దక్కించుకుంది. ఈనెల 26వ తేదీన ఢిల్లీలో నిర్వహించిన మాన్‌కీబాత్‌లో ప్రధాని నరేంద్రమోదీ విజయదుర్గ కవితను ప్రస్తావించారు. ఆమె రచించిన గేయం పంక్తులను ప్రధాని ప్రస్తావించడం విశేషం.